మానవత్వానికి ప్రతీక... మదర్ థెరిస్సా

గాంధీ మందిరంలో జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : మానవత్వానికి, నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా మదర్ థెరిస్సా నిలుస్తారని రిటైర్డ్ అడిషనల్ డిఎంఅండ్ హెచ్వో డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో భారతరత్న మదర్ థెరిస్సా 113వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాత డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ విదేశాల్లో జన్మించిన మదర్ థెరిస్సా భారతదేశంలో పేదలు, నిరాశ్రయులు, నిర్భాగ్యులకు సేవలు అందించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ నిక్కు అప్పన్న, బరాటం లక్ష్మణరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సాకు శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అభాగ్యులకు సేవలందించి నోబుల్ బహుమతితో పాటు భారతరత్న పొందిన మహోన్నత వ్యక్తి కొన్ని సంవత్సరాలు క్రితం జిల్లాలో పర్యటించడం గొప్ప విషయమన్నారు. అవధాన పండితులు పైడి హరనాధరావు మాస్టార్ మదర్ థెరిస్సా గొప్పతనం వివరించే గేయం ఆలపించారు. తొలుత మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గాంధీమందిర బృందం నటుకుల మోహన్, మహిబుల్లాఖాన్, నక్క శంకరరావు, పందిరి అప్పారావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, గుర్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు, సువ్వారి రాజారావు, శాస్త్రి తదితరులున్నారు.

సచివాలయం, ఆర్‌బీకె, అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం

విశాలాంధ్ర-రణస్థలం : మండలం యర్రవరం పంచాయతీలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 40లక్షలు వ్యయంతో నూతన 1.గ్రామ సచివాలయం, 21.80లక్షలు వ్యయంతో, 2.వైస్సార్ రైతు భరోసా కేంద్రం, 17.50లక్షలు వ్యయంతో 3.వైస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, 12.80లక్షలు వ్యయంతో 4.అంగన్వాడీ కేంద్రం నూతన భవనాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రణస్థలం మండలం ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్పీటీసీ టొంపల సీతారాం,జే.సి.యస్ ఇంచార్జ్ చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి బుజ్జి,వైస్ ఎంపీపీ ప్రతినిధి మైలపల్లి కామరాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు చిల్ల వర్షిణిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గురాన మానస,యర్రవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ బోనెల అప్పయ్యమ్మ, ఎంపీటీసీ బోనెల చిన్న,యర్రవరం గ్రామ సచివాలయం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మింది జనార్ధన్ రెడ్డి,జగ్గురోతు రాజారావు, రణస్థలం మండలం అధికారులు మండల స్పెషల్ ఆఫీసర్ దుర్గారావు,ఇంచార్జ్ ఎంపీడీఓ ధనుంజయరావు, పంచాయతీ డీఈ సీతంనాయుడు, అగ్రికల్చర్ ఏడీ శ్రీనువాసరావు, తహసిల్దార్ సనపల కిరణ్ కుమార్,పంచాయతీ జేఈ కూర్మనాదం,అగ్రికల్చర్ ఏవో విజయ్ భాస్కర్ రావు, హౌసింగ్ ఏఈ మోహన్ రావు, ఏపీవో శ్రీనువాసరావు నాయుడు, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనువాసరావు, ఆర్‌డబ్ల్యుస్‌జేఈ రామారావు, ఐసీడీఎస్ పీవో రూప్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆలయంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-అరసవల్లి : ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో శనివారం ఉదయం10.00 గంటలకు దేవస్థానం బైట్ గేట్ వద్ద దాతలచే నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్ ను మరియు ఇంద్రపుష్కరిణి వద్ద గోశాలను ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ఆలయ పాలకమండలి సభ్యుల సమక్షంలో దాతలచే నూతనంగా ప్రారంభించడం జరిగిందని ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు కలిదండి నరసింహరాజు దంపతులు, పెద్దిన కాళిదాసు దంపతులు, ఆలయ పాలకమండలి సభ్యులు ద్వారపు అజిత్ కుమార్, అనురాధ దంపతులు మరియు పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మీ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత అర్జీలపై దృష్టి సారించాలి

- సర్వే,సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ సిద్దార్థ్ జైన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందే వినతులలో అపరిష్కృత అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్వే,సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ సిద్దార్థ్ జైన్ అధికారులను ఆదేశించారు. అందిన అర్జీలన్నిటిని శతశాతం పరిష్కరించాలని, తద్వారా అర్జీదారులు సంతృప్తి చెందాలని సూచించారు. జిల్లాలో జగనన్నకు చెబుదాం(జెకెసి) కార్యక్రమంలో అర్జీదారుల సంతృప్తి స్థాయి బాగానే ఉన్నప్పటికీ, మరింత సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు, రెవిన్యూ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ సంస్థ తదితర శాఖాధిపతులతో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ తో కలిసి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని, తద్వారా అర్జీదారులు సంతృప్తి చెందాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖాధిపతి ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఏ శాఖలోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని, ఎక్కువ అర్జీలు పెండింగ్ ఉన్న శాఖలతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పరిష్కారం అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీ కాలపరిమితి లోగా పరిష్కారం కావాలని, కాలపరిమితి దాటిన వాటికి సరైన కారణాలు ఉండాలని వివరించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కారాదని,సరైన సమాధానం లేదా పరిష్కారం తోనే ఇటువంటివి పునరావృతం కావన్న విషయాన్ని అధికారులు గ్రహించాలని అన్నారు. తొలుత జలుమూరు మండలం లింగాలవలసలోని గృహ నిర్మాణాలను, కరవంజలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం,ఎచ్చెర్ల మండలం పొన్నాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, జిల్లారెవిన్యూ అధికారి పి.మురళీ కృష్ణ, రెవిన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, జిల్లా పంచాయతీ అధికారి వి. రవికుమార్, గృహ నిర్మాణ సంస్థ, ఐసిడిఎస్ పథక సంచాలకులు ఎన్. గణపతి, డా. జి.జయదేవి,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, నగర పాలక సంస్థ కమీషనర్ చల్లా ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బి.మీనాక్షి, డి.ఆర్.డి.ఏ పరిపాలన అధికారి దొర, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు గాయాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో లైన్మెన్‌కు గాయాలయ్యాయి. మండలంలోని కొర్లకోట వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ఎప్పటికప్పుడు మొరా ఇస్తుంది. శనివారం ఉదయం విద్యుత్ రాకకు అంతరాయం కలగడంతో లైన్మెన్ కింతలి రామమోహన్‌రావు చేసేందుకు మరమ్మతు చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్తంభంపై ఉన్న లైన్మెన్ రామ్మోహన్ కిందికి పడిపోయాడు. ఆ వేడికి శరీరం కొంత భాగం కాలిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో లైన్మెన్ ను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అక్కడ వైద్యులు తెలిపారు. కృష్ణాపురం నుంచి కొర్లకోట సచివాలయంలో లైన్మెన్ గా పనిచేస్తున్న రామ్మోహన్రావు అక్కడ ఉన్న ఫిర్యాదుల మేరకు విధి నిర్వహణలో మరమ్మతులు చేసేందుకు చేరుకున్నట్లు సచివాలయ సిబ్బంది తెలుపుతున్నారు. ట్రాన్స్ఫార్మర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఆయన గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం అందడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆయన స్వగ్రామం కృష్ణాపురం కావడంతో బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర-పొందూరు: వర్షాకాలం కారణంగా పశువులకు వ్యాపించే వ్యాధుల నివారణే ధ్యేయంగా పశు సంవర్ధక శాఖ ఆదేశాల మేరకు మండలం లైదాం గ్రామంలో శనివారం సచివాలయ ఆవారణలో పశువుల హెల్త్ పెర్టి లిటి క్యాంప్ నిర్వహించారు. ఈ పశు వైద్య శిబిరానికి గ్రామ సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించగా, పెనుబర్తి పశు వైద్యాధికారి డాక్టర్ పద్మావతి మూగజీవులకువ్యాపించే వ్యాధులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. గ్రామంలో ఉండే ఆవులు, గేదెలు,మేకలు, గొర్రెలుకు తనిఖీలు చేశారు. ఎదకు రాణి పశువులకు మరియు అనారోగ్య భారీన పడిన పశువులకు మందులు ఇచ్చారు. అలాగే రైతులకు పశు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పాడి రైతుల పశుపోషణలో మెలకువలను విపులంగా వివరించారు. మూగ జీవులకు వ్యాపించే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తం కావాలని కోరారు. పశు సంవర్ధక శాఖ అందించే వైద్య సేవలను ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు. రైతు క్షేమమే సర్కారు ధ్యేయంగా పనిచేస్తున్న తరుణంలో పాడి రైతులు ప్రభుత్వ సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బంగారు తల్లి, స్వాతి, ప్రసాద్, రాజా ,మురళి మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి అంకురార్పణ చేసిన మహానేత బొడ్డేపల్లి

రాష్ట్ర శాసనసభ స్పీకరు సీతారాం
రాజకీయ నేతలకు స్ఫూర్తి బొడ్డేపల్లి : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస : కరువుతో వలసలతో అధారపడి బ్రతుకుతున్న జిల్లా ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధికి 1952లోనే అంకురార్పణ చేసిన మహానేత, రాజకీయ నేతలకు స్ఫూర్తిగా నిలిచిన నాయకుడు బొడ్డేపల్లి అని రాష్ట్ర శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం, రాష్ట్ర మత్స్య,పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సౌజన్యంతో కాశీబుగ్గ కె.టి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహంను ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం రైల్వే ఇన్సిట్యూట్‌లో ప్రముఖ డాక్టరు జీవితేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో స్పీకరు సీతారాం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో గుర్తించుకునే నేతల్లో బొడ్డేపల్లి ఒకరని, స్వాతంత్రం అనంతరం దేశంలో జరిగిన అనేక విపత్కర పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడిన నేత అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జై ఆంధ్రా, జై తెలంగాణ ఉద్యమాలు బలంగా జరుగుతున్న పరిస్థితుల్లో సమగ్ర ఆంధ్రప్రదేశ్ ఉండాలని, కేంద్ర ప్రభుత్వానికి బలంగా చెప్పిన నేత అని, రాష్ట్రం ముక్కలైతే తెలుగువారు బలహీన పడతారని, ఐక్యంగా ఉండాలని కోరుకునే మహానాయకుడు బొడ్డేపల్లి అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఇస్తే ఉత్కళ, కళింగ రాష్ట్రం ఇవ్వాలని డిమాండ్ చేశారని అన్నారు. 1952లో జిల్లా నుంచి స్వాతంత్ర అభ్యర్థిగా పార్లమెంటు ఎన్నికల్లో గెలుపొందిన బొడ్డేపల్లి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరాలని దివంగత ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ ఆహ్వానిస్తే శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు వంశధారపై ప్రాజెక్టు నిర్మాణానికి అంగీకరిస్తే పార్టీలో చేరుతానని చెప్పి వాటికి అవసరమైన నిధులను పంచవర్ష ప్రణాళికలో కేటాయింపు చేయించుకున్న ఆదర్శవంతమైన నేతని కొనియాడారు. అప్పటి కృషి ప్రస్తుత తరం అనుభవిస్తున్నారని, ప్రజలు తినే ప్రతి ముద్దలో బొడ్డేపల్లి కనిపిస్తారని అన్నారు. నేటి తరానికి జిల్లా మహనీయుల చరిత్రలను తెలియచెప్పాలని కోరారు. బొడ్డేపల్లి, మార్పు పద్మనాభం, వీరనారి గున్నమ్మ త్యాగాలు అజరామమని అన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం 1952లో దేశంలో జరిగిన మొట్టమొదటి పార్లమెంటు ఎన్నికల్లో జిల్లా నుంచి స్వాతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి వెనుకబడి ప్రాంతం నుంచి విజయం సాధించడం వేరే ఎవరికి సాధ్యం కాదని, బొడ్డేపల్లి గొప్పతనం చెప్పుకోవడానికి ఇది ఒక్కటి చాలని అన్నారు. ప్రజలకు చేసిన మంచి పనులే వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. బొడ్డేపల్లి జిల్లా అభివృద్ధికి చేసిన కృషి, పట్టుదల నేటి తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి అని అన్నారు. నాటి రోజుల్లో కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం ఆలోచనతో ఆగిపోకుండా వ్యవసాయ కళాశాలలను, పరిశ్రమలను ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికి అడుగులు వేసిన నేత బొడ్డేపల్లి అని కొనియాడారు. ఆయన ఆలోచనలు చేసిన అభివృద్ధి పనులు జిల్లాలో సజీవంగా ఉండాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వంశధార ప్రాజెక్టుకు బొడ్డేపల్లి పేరు పెట్టారని, మళ్లీ అతని కుమారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆయన శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహించదానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు. బి.ఆర్.ఆర్ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా ప్రజలకు కానుకగా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే కేంద్రం మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, డాక్టర్ జీవితేశ్వరరావు, పలాస మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, జెడ్‌పి చైర్మన్ పిరియా విజయసాయిరాజ్, టెక్కలి వైసీపీ ఇన్‌చార్జ్ దువ్వాడ వాణి, డాక్టర్ పి.సూర్యం, హనుమంతు వెంకటరావులు ప్రసంగించారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బడగల బల్లయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టి, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయిక్రిష్ణ, వైసీపీ పట్టణాధ్యక్షులు సనపల సింహాచలం, పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్, చాపర వేణుగోపాల్, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబుచౌదరి, తలగాన నర్సింహులు, ఎల్.వి.చలం, బమ్మిడి నాగేశ్వరరావు, మొదలవలస మన్మధరావు, రోణంకి శాంతికుమారిలు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నిరంతర ప్రాధాన్యం

- నా వ్యాపార దృక్పథాన్ని వక్రీకరిస్తున్నారు
- రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-అరసవల్లి: నిజాయితీగా వ్యాపారం చేస్తున్నాను. తన వ్యాపార దృక్పథాన్ని అర్థం చేసుకోకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని ధర్మాన వ్యాఖ్యానించారు. రామోజీ రావు, విపక్ష నేత చంద్రబాబు చేసే అసత్య ప్రచారాలు నమ్మవద్దని పిలుపు ఇచ్చారు. అలానే తాము అధికారంలో ఉన్నంత కాలం జన్మభూమి కమిటీలకు ప్రాధాన్యం ఇచ్చాయే తప్ప, అదే సమయాన ప్రజలకు ఏం చేశామో చెప్పుకోలేని దుఃస్థితిలో ఇవాళ ప్రతిపక్షాలు ఉన్నాయని విమర్శించారు. నగరంలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నగర అభివృద్ధికి నిరంతర ప్రాధాన్య ఇస్తున్నామని రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని కత్తెర వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం అన్న కార్యక్రమాన్ని నిర్వహించి, లబ్ధిదారులతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు కానీ ఈ ప్రాంత అభివృద్ధికి కానీ ఏం చేశారో చెప్పాలన్నారు. ఇదే నేను ఇవాళ ప్రశ్నిస్తున్నాను. నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఏం చేశారో అన్నది రాష్ట్రంలో ఎవ్వరిని అడిగినా చెబుతారని, ఇందులో సందేహాలకు తావే లేదన్నారు. ప్రతి గడపకూ అభివృద్ధినీ, సంక్షేమాన్నీ అందిస్తున్నామని, జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తూ ఉన్నాం. అలానే రాజ్యాంగ స్ఫూర్తిని చాటుతూ సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి పక్షపాత వైఖరినీ పాటించక పనిచేస్తూ ఉన్నామన్నారు. ఆ రోజు అధికారంలో ఉండగా విభజిత రాష్ట్రంలో ఏం చేశారో చెప్పలేని దుస్థితిలో ఉన్నారు టీడీపీ నాయకులు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులుగా పనిచేసిన అచ్చెన్నాయుడు (కార్మిక శాఖ), నారాయణ (మున్సిపల్ శాఖ) అనేకసార్లు మార్కెట్ ని సందర్శించారు. వచ్చిన ప్రతిసారి మేదర వీధిలో రోడ్డుకి ఇరువైపులా ఉండే బుట్టలను తన్నేశారే తప్ప ఏ రోజు మార్కెట్ ని అభివృద్ధి పరచలేదన్నారు. కనీసం ఆ ఆలోచన కూడా చేయలేదన్నారు. విభజన హామీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు నష్టపరిహారంగా 23 విద్య సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది, 13 జిల్లాలు కలిగిన నాటి ఆంధ్రప్రదేశ్ కు జిల్లా కి రెండు చొప్పున కేటాయించాల్సి ఉందని, ఆ లెక్కన శ్రీకాకుళం కి రెండు సంస్థలు రావాలి. ఎందుకు చంద్రబాబు ఆ ఆలోచన చేయలేదని, శ్రీకాకుళం జిల్లాను చులకన గా చూశారు చంద్రబాబు నాయుడు అన్నారు. నన్ను ఓటేసి గెలిపించిన ప్రజలు, నన్ను దగ్గర నుంచి చూసిన వాళ్లకు తెలుసు నా క్యారెక్టర్. చంద్రబాబుకూ, రామోజీకి ఏం తెలుసు.? నా గురించి అని ప్రశ్నిస్తున్నాను. నాకు ధర్మబద్ధమైన వ్యాపారం ఉంది. సమాజం యాక్సెప్ట్ చేసేవిధంగానే వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నాను. వీటిని వక్రీకరించి, తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు ఆ ఇద్దరూ.. అన్నారు. ప్రథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో ఇంటి మేడ మీద ఏ రంగు లేదా ఏ పార్టీ జెండా కట్టారో లేదో అన్నది చూడలేదని, మళ్ళీ ఓటు వేస్తారో లేదో చూడలేదు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల వరకే ఓటు, పార్టీలు. తర్వాత ఏర్పాటైన ప్రభుత్వానికి పౌరులు అందరూ సమానమే. ఇదే మా ప్రభుత్వం ప్రిన్సిపల్ అన్నారు. దేశంలో ఇంక ఎక్కడా ఇలాంటి ప్రిన్సిపల్ ఆచరిస్తున్న ప్రభుత్వం లేదన్నారు. గత ప్రభుత్వంలో అంతా బ్రోకర్లమయం (జన్మ భూమి కమిటీల పేరిట ఆ రోజు నిబంధనలకు నీళ్లొదిలారు). పౌరులకు అందించిన పథకాల్లో వారికి వాటా ఇవ్వాల్సిందే. కానీ ఇప్పుడు ఇందుకు భిన్నంగా పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రతి గ్రామంలో, వార్డులో ఒక కార్యాలయం ఏర్పాటు చేసి, వారికి అనుసంధానంగా వలంటీర్స్ ను నియమించి, నిష్పక్షపాతంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేశు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధ వరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతీ, పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షులు సాదు వైకుంఠ రావు, కోణార్క్ శ్రీనివాస్ రావు, సుంకరి కృష్ణ కుమార్, ఎన్ని ధనుంజయ్, మండవిల్లి రవి కుమార్, ప్రకాష్, తెలుగు రమేష్, వాన పల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పరిశీలించిన సిద్ధార్థ జైన్

విశాలాంధ్ర-జలుమూరు: మండలం, లింగాలవలసలో జగనన్న కాలనీల ఇండ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించేందుకు సర్వే, భూ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ జైన్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాజీ డిప్యూటీ సీఎం సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణ దాస్ ను ఆత్మీయ పూర్వకంగా కలిశారు. ఆయనకు బీసీ సెల్ జోనల్ ఇన్చార్జి, జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండలాధికారులు తదితరులు ఉన్నారు.

జిల్లాపై ప్రభుత్వం చిన్నచూపు

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి

విశాలాంధ్ర-మందస : జిల్లా విభజన జరిగి రెండేళ్లు పూర్తి అయినప్పటికీ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి పట్ల వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. శనివారం ఐటిడిఎ సీతంపేట వద్ద గిరిజనలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల విభజనలో ఆదివాసీలకు న్యాయం చేయాలని, ఎస్టీ నియోజకవర్గం కేటాయించాలని కోరారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎను ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్శిటీ ప్రారంభోత్సవం సందర్భంగా సాలూరులో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ప్రకటిస్తారని గిరిజనులు ఆశగా చూశారని, ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో నిరాశ చెందారని అన్నారు. జిల్లాలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు చొరవ చూపి మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ స్థాపన కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సింహాచలం, అధ్యక్షులు అప్పన్న, కొత్తూరు కిరణ్, పి.ప్రకాష్‌లు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సత్కారాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఉత్తమ ఫోటో జర్నలిస్టులుగా, ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన శ్రీకాకుళం వాసులకు సత్కారాలు ఏర్పాటు చేసినట్టు ఏపీయూడబ్ల్యూజే, స్వామ్నా, అరసం, ఇస్కఫ్, తెరవే తదితర సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో జరిగే ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన సింహాచలం (ఈనాడు-హైదరాబాద్), పి.జోగారావు (ఆంధ్ర జ్యోతి-విజయనగరం), కె.జయ శంకర్ (సాక్షి-శ్రీకాకుళం) శ్రీకాకుళం నగరానికి చెందిన వారు కావడం విశేషం.

ప్రకృతి వ్యవసాయంలో రైతు శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ఎచ్చెర్ల మండల కేంద్రంలో టి.టి.డి.సి కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారుల బృందం రైతు శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ థిమాటిక్ లీడ్ ప్రకాష్ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మరియు పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎంపిక చేయబడిన సిబ్బందికి రైతు శాస్త్రవేత్తల శిక్షణను రెండవ రోజు నిర్వహిస్తున్నామని ఇది నాలుగు రోజులు పాటు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈ శిక్షణ కార్యక్రమం లో సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం లో సాంకేతికత నైపుణ్యాలు గురించి, అలాగే పంట దిగుబడులు పెరిగేందుకు మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించామని అన్నారు. అలాగే వివిధ రకాల పద్ధతుల్లో కూరగాయలు సాగు మోడల్స్ విధానం గురించి శిక్షణ ఇచ్చామన్నారు. రైతు శాస్త్రవేత్తలు గా శిక్షణ పొందిన సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులతో ప్రకృతి సేద్యంలో టెక్నికల్ గా మోడల్ పద్ధతిలో వివిధ రకాల సాగు విధానాలను తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపియమ్ ధనుంజయ్, రైతు సాధికార సంస్థ నుండి వచ్చిన నీరజ, డి.పి.పి.పి చంద్రభాను మరియు సిబ్బంది బాబాజీ, గోవింద్ రెడ్డి, మానస, సనత్ తదితరులు పాల్గొన్నారు.

'సిక్కోలు' సిగలో చిరస్మరణీయుడు బొడ్డేపల్లి : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-సోంపేట : శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో ఎనలేని పాత్ర పోషించి చిరస్మరణీయుడుగా మాజీ ఎంపీ, దార్శనికుడు, స్ఫూర్తిప్రధాత స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు జన హృదయాల్లో కీర్తి సాధించారని రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాలలో భాగంగా స్థానిక వైద్యుడు డాక్టర్ సంపతిరావు రాజేంద్రప్రసాద్ శ్రీకాకుళానికి చెందిన వైద్యుడు డాక్టర్ దానేటి శ్రీధర్‌ల ఆర్థిక సహకారంతో సోంపేటలో నెలకొల్పిన బొడ్డేపల్లి నిలువెత్తు విగ్రహాన్ని శనివారం సాయంత్రం స్పీకర్ తమ్మినేనితో పాటు రాష్ట్ర పశుసంవర్ధక శాఖామంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లాచైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్, మాజీ మంత్రి గౌతు శివాజీ, మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు రాజగోపాలరావు నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా చరిత్రలో ఆరుసార్లు జిల్లా నుంచి ఎంపీగా విజయం సాధించి విశిష్ట పార్లమెంటేరియన్‌గా బొడ్డేపల్లి ఖ్యాతి గడించారని అన్నారు. తన పదవీకాలంలో నిర్విరామంగా జిల్లా అభివృద్ధికి జిల్లాలో బలహీన సామాజికవర్గాల అభ్యున్నతికి విశేషమైన కృషి చేశారని అన్నారు. బొడ్డేపల్లి హయాంలో జిల్లాలో ఎటువంటి వివక్షకు తావు లేకుండా అన్ని వర్గాలను తనవాళ్లుగా భావించి వారి శ్రేయస్సు కోసం ఎంతో దూరదృష్టితో ఆలోచించి ప్రజల సంక్షేమానికి బాటలు వేసిన దార్శనికుడని అన్నారు. జిల్లాలో లక్షలాది కుటుంబాలకు వంశధార ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించి జిల్లాను సస్యశ్యామలం చేయడానికి మొట్టమొదటిగా అంకురార్పణ గావించిన మహానుభావుడు బొడ్డేపల్లి అని అభివర్ణించారు. ఆయన హయాంలోనే జిల్లాలో మూడు చోట్ల వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, అనేక జనపనార మిల్లులు, ఆమదాలవలస చక్కెర కర్మాగారం వంటి అభివృద్ధి కార్యక్రమాలు పట్ల ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. ఆయన భౌతికంగా ప్రజల మధ్య లేకున్నా ఆయన సేవలు ఇప్పటికీ ఈ జిల్లా ప్రజలు అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. 1952లో ఇండిపెండెంట్‌గా రాజ వంశస్థుడైన టిఎల్ఎన్‌రాజుపై లోక్‌సభ సభ్యునిగా ఘన విజయం సాధించి అనంతరం పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ, బోగరాజు పట్టాభిరామయ్య వంటి ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన గొప్ప వ్యక్తి రాజగోపాల్ అని అన్నారు. నాడు జిల్లా అభివృద్ధి కోసం రాజగోపాల్ కన్న కలలు, ఆయన ఆశయాలు నేడు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ సాకారం చేసుకున్నారని పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర అభివృద్ధికి జగన్ పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రాజగోపాల్ వంటి మహానుభావుల చరిత్రను ముఖ్యంగా ప్రస్తుత యువతరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కారణంగానే జిల్లాలో ప్రతిచోట ఈ జిల్లా అభివృద్ధికి, ఈ రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహానుభావుల విగ్రహాలను స్థాపించి ఆవిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాసురెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, జెడ్పీటీసీలు తడక యశోద, ఇప్పిలి లోలాక్షి, తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావు, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ సంపతిరావు రాజేంద్రప్రసాద్, డాక్టర్ జీవితేశ్వరరావు, కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, చాపర సుందర్‌లాల్, పూడి నేతాజీ, పూడి నీలాచలం, తదితరులు పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హాజరైన అతిథులందరికీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పక్కనే ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మొక్కలు నాటి పర్యావరణం కాపాడండి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలని భారతీయ హ్యూమన్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్. డేనియల్ అన్నారు. శనివారం మంచినీళ్లపేట, డోకులపాడు, హుకుంపేట పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్లాంట్ ట్రీ సేవ్ లైఫ్ అనే నినాదం తో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. చెట్లు అంతరించిపోవడం వలన భూతాపం పెరిగి పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి అన్నారు. మొక్కలు నాటడం తోపాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు. మొక్కలు నాటడం మహోద్యమం గా చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి. రాజేంద్ర, జిల్లా కార్యదర్శి ఎ. విజయ్ కుమార్, మండల బాధ్యులు ఎ. కృపారత్నం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శనివారం పలాస మున్సిపల్ కార్యాలయంలో రూ. 46 లక్షలు వ్యయంతో చెత్త సేకరణక కోసం కొనుగోలు చేసిన వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా కాలువలు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. పూర్తి స్థాయిలో పనులు చేపట్టి మున్సిపల్ రోడ్లపై చెత్త చెదారం పేరుకు పోకుండా చర్యలు చేపడతామన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పాలక ప్రతిపక్ష కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కమిషనర్ టి నాగేంద్ర కుమార్, టిపిఓ సీతారాం కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు ప్రచార కార్యక్రమాలు, ధర్నాలు జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం ప్రచార కార్యక్రమాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలోనూ, అధిక ధరలు అదుపు చేయడంలోను ఘోరంగా విఫలమైందని వారు విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి అదాని, అంబానీ వంటి కార్పొరేట్లు, బడా పెట్టుబడుదారుల ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని వారు విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు రోజు రోజుకి అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని, పేద మధ్యతరగతి ప్రజానీకం జీవనం కష్టంగా మారిందని వారు అన్నారు. మోడీ గద్దెనెక్కిన వెంటనే రూ.450లు వుండే గ్యాస్ సిలిండర్ నేడు రూ.1200లకు పెరిగిందని, పెట్రోల్, డీజిల్ చార్జీలు అంతులేకుండా పెరుగుతున్నాయని, కాయగూరల ధరలు ఊహించిన విధంగా ఈ నెలలో 37% పెరిగాయని, పప్పు దాన్యాలు 45శాతం పెరిగాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదు సరే కదా పరిశ్రమలు మూతపడి లక్షలాదిమంది ఉపాధి కోల్పోతున్నారని వారు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని ఆ హామీను గాలికి వదిలేసి 7 సార్లు విద్యుత్ ఛార్జింగ్ పెంచారు. ఇప్పుడు నెలవారి పెంపుదలకు రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అధిక ధరలు అరికట్టాలని కోరుతూ ఆగస్టు 30 నుండి ప్రచారము మరియు సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న గ్రామ వార్డు, సచివాలయాలకు వినతి పత్రాలు, సెప్టెంబర్ 3న నిరుద్యోగ వ్యతిరేక దినము, సెప్టెంబర్ 4న మండల కార్యాలయ వద్ద ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోండి

- గుంపులు గుంపులుగా వీధుల్లో సంచారం
- భయభ్రాంతులకు గురౌతున్న ప్రజలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో సమూహాంలతో కూడి అటుగా వెళ్తున్న పాద చారులను, ద్విచక్ర వాహనదారులను, పాఠశాలలకు వెళ్తున్న, వస్తున్న బాలబాలికు ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. గతంలో పంచాయతీ సిబ్బంది ఈ గ్రామ సింహాలను పట్టుకుని గ్రామానికి దూరంగా వదిలేయడం లేదా ఇతర మార్గాల ద్వారా ఊళ్ళోలోకి రాకుండా తగిన చర్యలు తీసుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వీటికి హద్దు అదుపు లేకుండా పోయింది. కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డు, కరణాలవీధి, రెడ్డికవీధి, పంచాయతీ కార్యాలయం రోడ్డు, ప్రభుత్వ పాఠశాలరోడ్డు, సీతన్నపేట రోడ్డు, కొత్తపేట గ్రామ ప్రధాన సెంటర్లో నిత్యం వాహనాలతో, ప్రయాణికులతో, ఇతర పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రదేశాలలో వీధి కుక్కలు గుంపులుగా ఏర్పడి బిగ్గరగా మొరగడం, ప్రజలపై ఎగబడదం, వాహనాలకుడ్డుగా నిలబడి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ శునకానందం పొందుతున్నాయని పలువురు అంటున్నారు. ఎవరు లేని సమయంలో ఇళ్ళల్లో చొరబడి పెంపుడు కోళ్ళను కూడా ఎత్తుకెళ్తున్నాయం టూ గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల నివారణకు తగు చర్యలు తీసుకుని ప్రజలకు, పాఠశాలలకు వెళ్ళే చిన్నారులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

టిడ్కో డిపాజిట్ డబ్బులు ఎప్పుడిస్తారు

మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్ గురిటి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కోసంగపురం సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు సంబంధించి పేద, మధ్య తరగతి ప్రజల నుంచి మున్సిపల్ అధికారులు 50వేలు, లక్ష రూపాయలు చొప్పున్న అప్పులు చేసి ఐదేళ్ల క్రితం డిపాజిట్ చేశారని, ఏళ్లు గడుస్తున్నా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు సరికదా జగనన్న గృహాలు మంజూరు చేయడం లేదని తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మున్సిపల్ అధికారులను నిలదీశారు. శనివారం పలాస మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు కోసం గతంలో చెల్లించిన డబ్బులు కోసం తన ఇంటివద్దకు వచ్చి ప్రజలు అడుగుతున్నారని, వారికి ఎటువంటి సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నామని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏడాది నుంచి తన వార్డులో పవర్‌బోరు వేస్తామని ప్రతి సమావేశంలో చెప్పడమే తప్పా ఎందుకు వేయలేదని అధికారులను నిలదీశారు. రామలక్ష్మీ కాలనీలో తాగునీరు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించిందని, శుభ్రం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ బల్ల గిరిబాబు స్పందిస్తూ టిడ్కో ఇళ్ల డిపాజిట్ డబ్బులు కమిషనర్ ఖాతాలో ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు చెల్లించడం జరుగుతుందని అన్నారు. బోరు విషయమై కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం వలనే వేయలేకపోతున్నామని స్పష్టం చేశారు. కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఆవులను రోడ్లపైకి విడిచిపెడుతున్నారని, దీనివలన ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుందని అన్నారు. రోడ్లుపై పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఆవులు తినడం వలన మృత్యువాతలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలు తీసుకొని ఆవులను రోడ్లపైకి విడిచి పెడుతున్న ఆవుల యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ పి.ప్రసాద్ మాట్లాడుతూ జంట పట్టణాల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, ఇటీవల కొంతమంది విద్యార్థులకు గాయపర్చాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో చాలా వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని, రాత్రి సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ జోగ త్రివేణి, తంగుడు ఆశారాణి, కర్రి మాధవరావు, సనపల సింహాచలం, ఎస్.గీతలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు మీసాల సురేష్, బోర క్రిష్ణారావు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

- స్థానికంగా అధిక ధరలకు అమ్మకాలు
- తనిఖీ జాడ కనిపించని ఎస్ఈబీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వం మద్యం దుకాణాలు ఉండే పరిసర ప్రాంతాలతో పాటు పల్లెల్లో బెల్ట్ షాపులు మూడుపూలు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. చిన్నపాటీ దుకాణం పేరుతో ఏర్పాటు చేసుకుని అందులో వాటర్ ప్యాకెట్లు, డిస్పోజబుల్ గ్లాసులు పెట్టుకొని మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. కొద్దిగా ధరలు తేడాలు ఉంటాయి. ఎప్పుడైనా మద్యం దొరుకుతున్నప్పుడు ధర ఎంతైనా ఆలోచించకుండా మందుబాబులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో మద్యం నిత్యం అందుబాటులో ఉండడంతో యువత దానికి బానిసులుగా మారుతున్నారు. మద్యం సేవించి గొడవలు పడుతున్నారు. వ్యక్తులు విడిగా తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు బారిన పడుతున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న సంబందిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం మద్యం విక్రయాలను అధికంగా నిర్వహించి ఆదాయం పెంపొందించేందుకు వీలుగా అవకాశం కల్పిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ మద్యం వ్యాపారం జోరుగుగా సాగుతోంది. గ్రామాలలో విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అక్రమ వ్యాపారం పై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బెల్టు దుకాణాలు పుట్టగొడుగుల్లా పెరగడంతో పల్లెల్లో తరుచు గొడవలు జరుగుతున్నాయని మహిళలు వాపోతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే బెల్టు దుకాణాల నిర్వాహకులు వారిపై ఘర్షణకు దిగుతున్నారు. దీంతో ప్రజలు ఏమి జరుగుతున్న మౌనంగా ఉండిపోతున్నారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టకపోతే గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉందని ప్రజలు చెప్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు స్పందించి బెల్టు దుకాణాలను నిర్మూలించాలని పలువురు మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న చలో విజయవాడ

వై నాట్ ఓపీఎస్ గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడ లో 'వై నాట్ ఓపీఎస్' పేరు తో భారీ ర్యాలీ,సభ నిర్వహిస్తున్నట్లు ఏపిసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి సూరిబాబు అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సంతబొమ్మాళి మండలంలోని మండల రెవెన్యూ కార్యాలయం, మండల వనరుల కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల యందు వై నాట్ ఓపీఎస్ గోడ పత్రిక ఆవిష్కరించారు. అనంతరం ఏ.పి.సి.పి. ఎస్.ఈ.ఏ జిల్లా గౌరవ అధ్యక్షులు బాడాన రాజు, మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాడు ప్రతిపక్ష నేత హోదాలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజులులోగా సీపీఎస్ విధానం ను రద్దు చేస్తానని ఇచ్చిన హామీ ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు కోరుతూ ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తూ ఉంటే జి.పి.ఎస్ పేరుతో మరో మోసానికి తెరలేపడం దురదృష్టకరమన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరణ తప్ప మరే ప్రత్యామ్నాయానికి అంగీకరించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కామరాజు, రాంబాబు, హేమంత్, చిన్నారావు, జానకిరామ్, ఇతర ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగన్నాథపురం బ్రిడ్జి నిర్మాణంకు రూ.30 లక్షలు

కూలిన బ్రిడ్జి పరిశీలించిన వాణి శ్రీనివాస్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం జగన్నాధపురం గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలకు కూలిన వంతెన ను శనివారం టెక్కలి నియోజకవర్గము వైకాపా ఇంచార్జ్ దువ్వాడ వాణి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి 30 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ జోగి రాములమ్మ కు తెలియజేసారు. అలాగే జెడ్పిటిసి పాల

వసంతరెడ్డి, ఎంపిపి మేరుగు రాజేశ్వరి అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయుకులు, (గోవిందరావు) తహశీల్దార్ చలమయ్య, సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు, మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు పాల్గొన్నారు. టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కణితి కిరణ్ కూలిన వంతెన పరిశీలించారు ఆయనతో జనసేన కార్యకర్తలు ఉన్నారు. ఈకార్యక్రమంలో సాగర మత్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పుక్కళ్ళ లక్ష్మణరావు, సర్పంచ్‌లు లోకనాదము, ఎన్ని మన్మధరావు, నక్కిట్ల నరేష్, వైకాపా నాయకులు లండ రామారావు పాల్గొన్నారు.

రంగం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : కర్నూల్ పట్టణంలో సెప్టెంబరు 9, 10వ తేదీల్లో నిర్వహించే రంగం ప్రధమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రంగం రాష్ట్ర ప్రచార కార్యదర్శి దుబ్బ రాజగోపాల్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయంలో మంత్రిచే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆంధ్ర రాష్ట్రంలో చైతన్యవంతమైన పాత్ర పోషిస్తుందని, తిత్లీ తుఫాన్ సందర్భంగా అతలాకుతలమైన ఉద్దానం ప్రాంతంను ప్రపంచానికి తెలియజేసే గీతాన్ని అందించాలని, తుఫాన్ బాధితులకు కళారూపాల ద్వారా అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా కళ సేవ చేస్తున్నారని కొనియాడారు. జిల్లా అధ్యక్షులు కొర్నాయి శ్రీకాంత్ మాట్లాడుతూ రంగం జానపదాల పరిరక్షణ కోసం దేశభక్తి అభ్యుదయ భావాల వ్యాప్తి కోసం, మన భాషా, సాంస్కృతిల పట్ల యువతిలో చైతన్యం చేయడం కోసమే తమ సంస్థ విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో చిక్కోలు జగదీష్, ఎల్.వి.చలం, నీటిపారుదల డైరెక్టర్ మల్లా రవి, గూన మన్మధరావు, మధుసూధన్, గణేష్, జయరాజ్‌లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సీతాపతి విగ్రహావిష్కరణ వృద్ధులకు బట్టలు పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరంలోని కలెక్టర్ ఆఫీస్ రోడ్డులో ప్రశాంతి వృద్ధ జనాశ్రమ నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించిన విగ్రహదాత, దివంగత వ్యాపారవేత్త పేర్ల సీతాపతి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సీతాపతి కుటుంబ సభ్యులు పేర్ల నవీన్, సంతోష్ రమాదేవి చేతుల మీదుగా ప్రశాంతి వృద్ధ జనాశ్రమ ప్రాంగణంలో ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ అధ్యక్షులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపార వేత్తగానే కాకుండా ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పేర్ల సీతాపతి సహాయ సహకారాలు సమాజానికి ఎప్పుడూ అందిస్తూ ఉండేవారని అన్నారు. పేర్ల సీతాపతి జ్ఞాపకార్థం వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు యు.వి రమణ, బి.ఏ.ఎల్ ప్రసాద్, డి.పార్వతీశం, మోహన్రావు, ప్రియంవద సూర్యరావు, మేనేజర్ సంతోష్, సీతాపతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చిన వారందరికీ ఇల్లు మంజూరు చేయిస్తా..!

- అంధవరం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-జలుమూరు : నిరుపేదలకు ఇల్లు మంజూరు చేసే విషయంలో తగ్గేదే లేదని అందవరం పంచాయతీలోనే స్థలం సేకరించి ఇల్లు మంజూరు చేసి ఇస్తామని జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ హామీ ఇచ్చారు. శనివారం జలుమూరు మండలం అంధవరం పంచాయతీలో రామకృష్ణాపురం, ఉప్పరపేట, అందవరం గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామ ప్రజలకు పట్టాలు మంజూరు చేశారు. కానీ స్థలం ఇవ్వలేదని చెప్పగా అక్కడున్న సచివాలయ సిబ్బందికి అసలు విషయం అడిగి తెలుసుకున్నారు. ఆ పంచాయతీలో ఇల్లు లేని నిరుపేదలకు పర్లాం గ్రామ పంచాయతీలో ఇల్లు మంజూరు చేయగా.. వీళ్ళ అక్కడికి వెళ్ళమని మొండికేసారని చెప్పారు. దాంతో వీరికి ఇళ్ల స్థలం ఇవ్వలేకపోయామని చెప్పారు. దాసన్న స్పందిస్తూ ఈ పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాన్ని సేకరించి వీరికి ఇల్లు ఇప్పించాలని తహసిల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, ఎఎంసీ చెర్మన్ మొజ్జాడ శ్యామలరావు పిఎసిఎస్ అధ్యక్షులు పోగోటి రాజపులనాయుడు, జెసీఎస్ అధ్యక్షులు ధర్మాన జగన్, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ తయారీకి సిక్కోలు బెల్లం

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ఆమదాలవలస మండలం నిమ్మతొర్లువాడ గ్రామంలో ప్రకృతి సేద్య అభ్యుదయ రైతు నక్కా చిరంజీవి రావు ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి సాగులో పండించిన బెల్లాన్ని పంపించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది శివాజీ, చిన్నమ్మడు మరియు శోభన్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి వ్యవసాయంలో పండించిన బెల్లాన్ని శనివారం గ్రామం నుండి పంపించడం జరిగిందని, దీనికి మంచి ధర రైతులకు వస్తుందని తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో మరింత ఎక్కువ మంది రైతులతో బెల్లాన్ని తిరుపతి దేవస్థానానికి ఎగుమతి చేయడం కోసం క్షేత్రస్థాయిలో మా సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. అదేవిధంగా సిబ్బంది డిజిటల్ సురేష్ మాట్లాడుతూ మా గ్రామం నుండి బెల్లాన్ని సాక్షాత్తు కలియుగ దైవమైనటువంటి శ్రీవారి లడ్డు తయారీలో ఉపయోగించడం కోసం వెళుతున్నందుకు మాకు చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమరాజు తేజేశ్వరరావు, మార్క్ ఫెడ్ మేనేజర్ రమణి, కళ్యాణ్ అలాగే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకి రామ్ మరియు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజశేఖర్ మరియు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మధర్ థెరిస్సా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని యం.పి.యు.పి. స్కూల్ గొర్లేపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గొల్లపాడులో ప్రధానోపాధ్యాయులు సీతంనాయుడు ఆధ్వర్యంలో 114వ మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసిన చేతులే గొప్పవి అనే నానుడికి నిలువెత్తు నిదర్శనం మదర్ థెరిస్సా అని తెలియజేస్తూ మదర్ థెరిస్సా కీర్తిని కొనియాడారు. అలాగే మదర్ థెరిస్సా మన దేశానికి చేసిన సేవలకుగాను గుర్తింపుగా ప్రపంచ అత్యంత పురస్కారమైన నోబెల్ బహుమతి మరియు భారత అత్యున్నత పుష్కారం భారతరత్న వంటి ఎన్నో అవార్డులు సైతం అందుకున్నారని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. మండల కేంద్రమైన కవిటి కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మదర్ తెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ తెరిసా చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలతో అలంకరణ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ బిందు మాధవి మదర్ తెరిసా సమాజ సేవ ఆమె చేసిన కార్యక్రమాలు గూర్చి వివరించారు. ప్రతిఒక్క విద్యార్థి మదర్ తెరిసా ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికార లాంచనాలతో అప్పారావు అంత్యక్రియలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చిట్టివలస గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కురుకోల అప్పారావు అంత్యక్రియలు శనివారం తన స్వగ్రామంలో పోలీస్ అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే అప్పారావు అనకాపల్లి జిల్లా నాతవరంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గతనెలలో విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అప్పారావు మృతదేహాన్ని స్వగ్రామంలో ఎచ్చర్ల ఏఆర్ పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పారావుకు భార్య సరళ, కుమార్తెలు భార్గవి. రాజి, కుమారుడు రాజేంద్రలు ఉన్నారు. అప్పారావు మృతితో చిట్టివలస గ్రామం సోకసంద్రం అయింది.

మున్సిపల్ హైస్కూల్లో శతక పద్య ధారణ పోటీలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: గిడుగు రామ్మూర్తి జయంతి వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్లో శతక పద్య ధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ దేవదత్తానంద్ విద్యార్థులను ఉద్దేశిస్తూ శతక పద్యాల ధారణ ద్వారా మానసిక వికాసంతో పాటు నైతిక విలువలు పెంపొందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పద్యాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు పండితులు చాడ శ్రీనివాస్, విద్యార్థులను ఉద్దేశిస్తూ పద్య పఠనం ద్వారా జ్ఞాపకశక్తి మెరుగవుతుందని, కవులు రచనలు అర్థం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. పద్యధారణ పోటీలు సమన్వయకర్తలుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని సుజాత, చంద్రకళ వ్యవహరించారు.

రెడ్‌క్రాస్ భవనంలో మథర్‌థెరీసా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-అరసవల్లి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పరిపాలన భవనం లో మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి జగన్మోహన్ రావు చిత్రపటానికి మాలధారణ చేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సేవా రంగాల్లో మదర్ థెరీసా తనదైన ముద్ర వేసుకున్నారని, మురికివాడల్లో అనారోగ్యంతో ఉన్నవారికి మరిన్ని సేవలు అందించారని, కుష్టి వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకొని స్వస్థత అందించారని అన్నారు. కనుగుల దుర్గా ధీరజ్ చారిటబుల్ ట్రస్టు నిత్యాన్నదానం కార్యక్రమం మదర్ థెరీసా జయంతిని ఘనంగా నిర్వహించారు. కే.లోకేశ్వరరావు జన్మదిన సందర్భంగా 35వ సారి రెడ్ క్రాస్ రక్తనిది నందు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పి చైతన్యకుమార్, బి. చిన్మాయరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

విశాలాంధ్ర-హిరమండలం : అలికాం - బత్తిలి ఎబి రహదారిపై పాత హిరమండలం వద్ద వెదుళ్ల గెడ్డ పై వంతెన ఇది బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన ఈ వంతెన శిధిల దశ కు చేరి ప్రమాదకరం గా మారి ఏ క్షణాన కూలుతుందోనని భయం గుప్పిట్లో రాక పోకలు సాగించే వాహనదార్లు ఉంటున్నారు. ఈ వంతెన కూలెందుకు సిద్ధంగా ఉందని పట్టించుకున్న అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని లేరని ప్రయాణీకులు, స్థానికులు అంటున్నారు. ఈ వంతెన పై నిత్యం బస్సులు, అధిక లోడు తో లారీలు ప్రయాణిస్తూ నిత్యం రద్దీ గా ఉంటుంది. వంతెన రక్షణ గోడలు పూర్తిగా పాడై పోయి పెచ్చులు ఊడి కలుపు మొక్కలు మొలిశాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఏళ్ళ గడుస్తున్న వంతెన మారమ్మత్తుల కు నోచుకోవడం లేదు.. శిదిలా దశ వంతెన పై ఒక్క బస్సు వెళ్ళగలదు ఎదురుగా వాహనం వస్తే వంతెన కు ముందే నిలుపుదల చేయాల్సిందే. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు వంతెన కూలక ముందే చర్యలు తీసుకో వాలని పలువురు కోరుకుంటున్నారు.

పేదల పాలిట వరం అన్న క్యాంటీన్

7వ రోజు అన్నా క్యాంటీన్ కొనసాగింపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన అన్నా క్యాంటీన్ పేదలకు వరం లాంటిదని నియోజకవర్గ మహిళా కార్యదర్శి గొండు స్వాతిశంకర్ అన్నారు. టీడీపీ యువ నాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నాక్యాంటీన్ బుధవారం ఏడో రోజు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా కార్యదర్శి గొండు స్వాతిశంకర్ పాల్గొని పేదలకు భోజనం అందించారు. ఈ సందర్భంగా స్వాతి శంకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ, మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం 2024 లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024 లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మరలా అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తారని చెప్పారు. చంద్రబాబునాయుడు మరలా ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తారని, నేటి వైస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమైనవని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 430 మంది అన్నార్తులు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మి రాజ్యం, బగ్గు నలమహారాజు, ఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు రెడ్డి శంకర్, రఫీ, పేట పద్మా, శిమ్మ శ్యాంసుందర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖాధికారులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలో గల వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఆ శాఖధికారులు బుధవారం సందర్శించారు. ఆలయానికి సంబంధించిన చరిత్ర తెలుసు కోవడంతో పాటు ఆలయ నిర్వహణను ఎవరు, ఎలా నిర్వహిస్తున్నారు తదితర వాటి వివరాలను ఆలయ పూజారి వారికి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆలయ సరిహద్దులు, భూములు తదితర వాటి వివరాలు సైతం తెలుసుకున్నారు. అనంతరం ఆలయానికి ఏదరంగా ఉన్న ఉయ్యాల మండపం వద్దనున్న స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో వాటిపై తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇక్కడకు వచ్చి వాటిని పరిశీలించడంతో పాటు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీటికి సంబంధించి రికార్డుల పరిశీలనతోపాటు రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో దేవాదాయశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి. భారతి, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణాకుమారి, సర్వేయర్ సీతారామాచారి, ఎండోమెంట్ ఈఓ. హరిసూర్య ప్రకాష్ రావు, పాతపట్నం ఈఓ. వాసుదేవరావు తదితరులున్నారు.

జూన్ 1 నాటికి నాడు-నేడు పనులు శత శాతం పూర్తి చేయాలి

- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : నాడు-నేడు పనులు జూన్ 1వ తేదీ నాటికి శత శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఇంజనీర్లను ఆదేశించారు. మనబడి నాడు-నేడు రెండవ దశ పనులు, మరుగుదొడ్లు, కిచెన్‌లు, తదితర అంశాలపై ఎంఇఓలు, ఇంజనీర్లు, ఎపిఎంలతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కింద జిల్లాలో 1096 జూనియర్ కళాశాలలు, పాఠశాలలలో పనులు జరుగుతున్నాయన్నారు. నిధులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు జూన్ 1 నాటికి శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా ఆలస్యం జరుగకుండా పనులు కొనసాగించాలన్నారు. ఎపిసి జయ ప్రకాష్ మాట్లాడుతూ సిమెంటుకు సంబంధించి చెల్లింపులు పెండింగ్‌లో లేవన్నారు. సిమెంటు సరఫరా చేయని యాజమాన్యంతో జూంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఎపిసిని కలెక్టర్ ఆదేశించారు. నాడు-నేడు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనులు కొనసాగేలా చూడాలన్నారు. కమిటీ కాల పరిమితి పూర్తి అయిన గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి కోరం లేక ఇక్కడి నాడు-నేడు నిధులు వేరొక స్కూల్ కి వెళుతున్నట్లు గ్రామస్తులకు చెప్పాలన్నారు. నిధులు అందుబాటులో ఉన్నాయని పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రగతి పెంచాలని చెప్పారు. ఈ సమావేశంలో మండలాల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల ఎంఈఓలు, మండల ఇంజనీర్లు, ఎపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కోణంలో కేసులు దర్యాప్తు : జిల్లా ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించుకొని సైబర్ కేసులు దర్యాప్తులో నైపుణ్యాన్ని పెంపొందించుకొని శాస్త్రీయ ఆధారాలు తో సైబర్ కేసులు శాస్త్రీయ కోణంలో దర్యాప్తు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో దర్యాప్తులో ఉన్న సైబర్ నేరాలు దర్యాప్తు, కేసులు ఛేదన, ముద్దాయిలు అరెస్ట్ తదితర అంశాలపై ఎస్పి జి.ఆర్. రాధిక సర్కిల్ ఇన్స్పెక్టర్స్ స్థాయి అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా ఓటిపి ఫ్రాడ్స్,కెవైసి ఫ్రాడ్స్,జాబ్ ఫ్రాడ్స్,లోన్ యాప్స్ ఫ్రాడ్స్, ఆధార్ ఏన్బెల్ ఫ్రాడ్స్,ఫేక్ కస్టమర్ కేర్ ఫ్రాడ్స్ తదితర సైబర్ కేసులు దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై ఎస్పీ సీఐ లకు దిశ నిర్దేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో ఆచరణలో పెట్టి కేసుల దర్యాప్తు వేగవంతం చేసి కేసులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే నేర విధానం,తరహా గమనించాలని, త్వదారా ఆయా కేసులో ఎటువంటి ఏవిధమైన ఆధారాలు సేకరించాలని ప్రణాళికబద్ధంగా ముందుస్తు చర్యలు తీసుకొని కేసులను దర్యాప్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(క్రైమ్) టిపి విఠలేశ్వర్,శ్రీకాకుళం పట్టణ డిఎస్పీ మహీంద్రా మాతే, కాశీబుగ్గ డీఎస్పీ ఎం . శివా రామి రెడ్డి, సిఐలు బి. ప్రసాద్ రావు,పి.శ్రీనివాసరావు,ఎల్. సన్యాసి నాయడు, ఈశ్వర్ ప్రసాద్, రవి ప్రసాద్, శ్రీనివాసరావు సైబర్ సెల్ ఎస్సై ప్రసాద్ రావు,ఏఎస్ఐ రమేష్, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

మేఘవరం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మేఘ వరం పంచాయతీలో స్థానిక సర్పంచ్ పరపతి సునీత శ్రీనివాసరెడ్డి అధ్యక్షత న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఇంటికి జగనన్న అభివృద్ధి కార్యక్రమాలు, జగనన్న ప్రతి పేద కుటుంబానికి అందిస్తున్న పథకాలు గురించి తెలియజేశారు. అనంతరం వృద్ధురాలతో మాట్లాడుతూ, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ కిల్లి జగన్నాయకులు (గోవిందరావు), ఎంపీటీసీ సూరాడ రాజారావు, మేఘవరం పంచాయతీ మాజీ సర్పంచ్ పి. మేనకేతన రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి నక్క భీమారావు, పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు అధికారులు పాల్గొన్నారు.

మెరిసిన విద్యా కుసుమాలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం/రణస్థలం : బుధవారం వెల్లడైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలకలు తమ సత్తా చాటుకున్నారు. స్వర్ణభారతికి చెందిన నిమ్మన పూజ ఎమ్పీసీలో 986మార్కులు, టి.దీప్తి 978మార్కులతో నియోజకవర్గ స్థాయిలో మెదటి శ్రేణిలో నిలిచారు. కాగా పట్టణంలో మహిళా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని అల్లు నిఖిల ఎమ్పీసీలో 968మార్కులు సాధించగా, ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థిని న్యాయపతి దివ్యశ్రీ అత్యధికంగా 970మార్కులు సాదించింది.

రణస్థలం ఏపీ మోడల్ స్కూల్‌లో.... ఇంటర్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో బి. గుణవర్ధన్ (974), ఆర్. చాందిని సౌమ్య (972), ఎల్. పావని (929), కె. సుజాత (460), జి. అశోక్ (427) ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీధర్ విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.



ఆదిత్యుని దర్శించుకున్న కమిషనర్

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని బుధవారం సాయంత్రం విశాఖపట్నం, ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ వాన శ్రీనివాసరావు దేవాలయంనకు విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీ స్వామి వారి జ్ఞాపికను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి ఎస్ చక్రవర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఐ టి ఓ దుర్గనంద్, ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినీట్రాక్టర్ ప్రారంభం

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం పలాసపురం గ్రామంలో ప్రగతి రైతుసేవా కేంద్రానికి వైఎస్సార్ యాత్ర సేవా కేంద్రం ద్వారా మంజూరైన మినీ ట్రాక్టర్‌ను స్థానిక సర్పంచ్ తదక జోగారావు బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న ఇటువంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని అన్నారు.

ఆత్మ లేకున్నా అంతటా నువ్వే కిరణ్!

ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో కిరణ్ చంద్‌కు కొవ్వొత్తులతో ఘన నివాళి

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రంలో ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో యువజన సంఘ సభ్యులు,విద్యార్థులు, గ్రామస్తులంతా కలిసి కిరణ్ చంద్‌కు ఘన నివాళులు అర్పించారు. కవిటి మెయిన్ రోడ్డు గుండా ఇలా అన్ని వర్గాలు కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కిరణ్ చంద్ అమర్ రహే అంటూ నినాదాలు మిన్నంటాయి. కిరణ్ చంద్ మృతి చెందడంతో అతడి అవయవాలు సజీవంగా నలుగురికి ప్రాణదానం చేసి కిరణ్ చంద్ సజీవంగా మన ముందున్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్, శ్రీ కళ్యాణి గ్రూప్ చైర్మన్ లోల్ల రాజేష్, గ్రామస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మానకు కండ్ర కులస్థుల సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్వదేశీ మత్స్యకారులు (కండ్ర కులస్థులు) (బుధవారం మంత్రి ధర్మాన ప్రసాదరావును కలుసుకుని సన్మానించారు. తమను బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలోకి చేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు కండ్ర కులస్థులు,స్థానిక వైసీపీ నాయకులు హాజరయ్యారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం



విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎస్సై బాలరాజు బుధవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరు వేసవి దృష్ట్యా సురక్షితమైన తాగునీటిని చలివేంద్రం ద్వారా వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు ఈ సందర్భంగా చలివేంద్రంలో తాగునీటిని స్వీకరించారు.

రక్తహీనత నివారణకు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: గర్భిణులు, పిల్లల్లో రక్త హీనత నివారణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఐసిడిఎస్ పిఓలను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పిఓలతో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైయస్ఆర్ సంపూర్ణ పోషణ, బాలామృతం, తదితర వాటి పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త హీనత గల పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఫోలిక్ యాసిడ్ మాత్రలు, తదితరమైనవి పంపిణీ చేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్లు డేటా ఎంట్రీ సరిగా చేయకపోతే సంబంధిత సిడిపీఓపై చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సిడిపీఓలు సందర్శించాలన్నారు. సిడిపీఓలు ప్రతీ నెల టూరు డైరి అందజేయాలని చెప్పారు. అంగన్వాడీ వర్కర్లకు తహసీల్దార్ కార్యాలయంలో పెట్టి డేటా ఎంట్రీ పై కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ రిపోర్టు వచ్చిన తర్వాత క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఏ అంగన్వాడీ కేంద్రంలో అయితే స్టాక్ సరఫరా అయి పిల్లలకు, గర్భిణులకు సరఫరా చేయలేదో అలాంటి అంగన్వాడీ వర్కర్లను సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు ఆధార్ అప్డేషన్ కు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. అంగన్వాడీ వర్కర్లకు టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తే ఆధార్ అప్ డేషన్ పై తెలియజేస్తామన్నారు. వచ్చే సమావేశంలో సిడిపీఓలు, సూపర్ వైజర్ లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్ చార్జ్ పిడి జి. జయదేవి, సిడిపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వసతి దీవెన కింద జిల్లాకు రూ.47.86 కోట్లు

- 50,895 మంది విద్యార్థులకు ప్రయోజనం
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జగనన్న వసతి దీవెన క్రింద జిల్లాకు 47.86 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో బటన్ నొక్కి నేరుగా వర్చువల్ విధానం ద్వారా 2022-23 విద్యా సంవత్సరంనకు సంబంధించి వసతి దీవెన తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ తల్లి దండ్రుల పై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, చదువుకు ఏ విధమైన ఆటంకం లేకుండా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు కింద కార్పొరేట్ పాఠశాలలుగా మారాయని, పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. పిల్లలు అంకిత భావంతో చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. జగనన్న వసతి దీవెన పథకం క్రింద జిల్లాలో ఐటిఐ పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువు కుంటున్న విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ లు లభించనున్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. జిల్లాలో 50,895 మంది విద్యార్థులకు సంబంధించి 45,907 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో 47.86 కోట్ల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాతపట్నం శాసన సభ్యులు రెడ్డి శాంతి, కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షులు అందవరపు సూరిబాబు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, బిసి సంక్షేమ అధికారి ఇ. అనూరాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్. గడ్డెమ్మ, డిఎల్డీఓ వాసుదేవరరావు, బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ. అనూరాధ, ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీర్లతో మంత్రి ధర్మాన సమీక్ష

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: నగరాభివృద్ధికి సంబంధించిన విషయాలపై, తాగునీటి సమస్య పరిష్కారంపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మున్సిపల్ ఇంజనీర్లతో పాటు వివిధ శాఖల సిబ్బందితో క్యాంప్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల శ్రీకాకుళం నగరంలో విలీనం అయిన ఏడు పంచాయతీలలో తాగునీటి సౌకర్యాన్ని శాశ్వత రీతిన అభివృద్ధి చేసేందుకు పలు సూచనలు చేశారు. వాటర్ సప్లై ఇంప్రూవ్మెంట్ ప్రాజెక్ట్ కు సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించిన సిస్ట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో కూడా ఆయన మాట్లాడారు. ఇప్పుడున్న నగర జనాభా ప్రస్తుతం సుమారు రెండు లక్షలు ఉందని, రానున్న ఇరవై ఏళ్లను దృష్టిలో ఉంచుకుంటే జనాభా మూడు లక్షలు దాటే అవకాశం ఉందని, ఇందుకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం అందించేందుకు 123 కోట్ల రూపాయలతో డీపీఆర్ రూపొందించారని చెప్పారు. ఇప్పుడు నగరానికి ఇరవై ఎంఎల్డీ లు రోజుకు తాగునీరు అవసరం అవుతోందని, పంచాయతీల విలీనం తరువాత రానున్న కాలంలో 16 ఎంఎల్డీల తాగునీరు అందించే విధంగా ఈ డీపీఆర్ లో పొందుపరిచినట్లు వివరించారు. ఆదివారం పేట ఎగువ ప్రాంతంలో ఒక పది ఎంఎల్డీలకు సంబంధించి వాటర్ వర్క్స్ జరగనుందన్నారు. మరో ఐదు ఎంఎల్డీలకు సంబంధించి బలగలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కమీషనర్ చల్ల ఓబులేసు, మున్సిపల్ ఇంజనీర్ గంగాధర్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ సుగునాఖర్, శిస్ట్ కన్సల్టెన్సీ నుంచి శాస్త్రి , చల్లా శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ వర్ధంతి

విశాలాంధ్ర-పాతపట్నం: మండలం ప్రధాన కేంద్రంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల లలో భారతదేశ ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలో ప్రిన్సిపాల్ ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాలా చేసి ఘనంగా నివాళులర్పించినారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్స్ పాల్ మాట్లాడుతూ బ్రిటిష్ పరిపాలనా కాలంలో భారత దేశంలో 20వ శతాబ్దపు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ కొనియాడారు. శుద్ధ గణితము, అనంతశ్రేణులు సంఖ్యాశాస్త్రం, అవిరామభిన్నాల్లో లాంటి గణిత విభాగాలో విశేషమైన కృషి చేశారు. అప్పట్లో పరిష్కారం కావు అనుకున్న కొన్ని సమస్యలు కూడా పరిష్కారాన్ని కనుగొన్నారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణపతి శ్రీరాములు, గణిత ఉపద్యాయురాలు విసాయి దేవి, అల్తి రాణి, నిర్మల, శకుంతల, మోహిని, యశోద, సునీత, సుజాత, నీలమ్మ, వి.విశ్వేశ్వరరావు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని శ్రీనివాస రామానుజన్ కి ఘన నివాళులు అర్పించారు.

అక్రమ సస్పెన్షన్‌లు ఎత్తివేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తీరు శోచనీయంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడ్డాయి. శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో పలువురు అధికారులు, ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారని ఆవేదన వ్యక్తం చేసారు. ఉపాధ్యాయుల పొరపాట్లు లేకున్నా వారిని తీవ్రంగా విమర్శించడం, శాఖాపరమైన చర్యల పేరుతో విధుల నుండి తొలగింపు వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఇచ్ఛాపురం తాలూక, కవిటి మండల ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు బుధవారం స్థానిక తహశిల్దార్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపి ఉప తహశిల్దార్ శ్రీహరికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఉపాధ్యాయుల అక్రమ సస్పెషన్‌లు ఎత్తివేయాలని డిమాండ్ చేసారు. రాజు, గోపి, లక్ష్మణమూర్తి, రంగారావు, రాజబాబు, శ్రీరాం బిసోయ్, సోమేష్, మురళి, ప్రసాద్, ఉమాశంకర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

బాధిత కుటుంబానికి నగదు చెక్కును ఎస్పీ అందజేత



విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో స్వీపర్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కె.అరుణ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష నగదు చెక్కును ఆమె కుమారుడు కె. తరుణ్ కుమార్ కు జిల్లా ఎస్పీ జిఆర్ రాధిక బుధవారం పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మీకు మీ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళల అండగా ఉంటుందని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు రావాల్సిన మిగిలిన ప్రయోజనలు సకాలంలో అందేటట్లు చూడాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ టిపి విఠలేశ్వర్, పరిపాలన అధికారి ఎం. శివా రామ రాజు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాతపట్నం: మండలంలోని పాశిగంగుపేట, తీమర మరియు తామర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక పేద, మధ్యతరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో అందర్నీ ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ప్రజలు గత ప్రభుత్వం లో సంక్షేమ పథకాల కోసం పడిగాపులు కాసేవారని, కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హత ప్రామాణికంగా వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎక్కడ ఎవరి రికమండేషన్లు లేవని ఎక్కడ ఎవరికి రూపాయి లంచం చెల్లించడం లేదని మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేవని ఈ పథకాలన్నీ ఇలాగే కొనసాగించాలంటే మళ్ళీ జగనన్నకు మీ అందరి మద్దతు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌చంద్ కుటుంబానికి ప్రముఖుల పరామర్శ



విశాలాంధ్ర-సోంపేట : ఇటీవల బ్రెయిన్‌డెడ్‌తో శ్రీకాకుళం ఆసుపత్రిలో మృతి చెందిన కిరణ్‌చంద్ కుటుంబాన్ని బుధవారం సోంపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కిరణ్‌చంద్ అవయవాలను ఇతరులకు దానం చేసిన విషయం తెల్సిందే. ఆ కుటుంబానికి పలువురు ప్రముఖులు బుధవారం పరామర్శించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం వైసీపీ ఇన్‌చార్జ్ పిరియా సాయిరాజ్, ఎంపిడి డాక్టర్ నిమ్మన దాసు పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం కల్పించారు. ఇదిలాఉండగా ఇచ్ఛాపురం వైసీపీ సీనియర్ నాయకుడు కెజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉలాల కోదండరాంతో పాటు గోవిందరాజులు, తదితరులు అదే కుటుంబానికి పరామర్శించి ధైర్యం తెలిపారు. మీ కుటుంబ త్యాగాన్ని ఈ సమాజం ఎన్నటికి మర్చిపోలేదని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత అవసరం

విశాలాంధ్ర-ఎచ్చర్ల : సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సృజనాత్మకత అవసరమని ట్రిపుల్ ఐటి శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వర్ రావు అన్నారు. ఇక్కడ క్యాంపస్లో సిఎస్సి విభాగం ఆధ్వర్యంలో సంవేదన పేరిట ఈనెల 28,29 తేదీల్లో నిర్వహించనున్న టెక్ ఫెస్ట్‌కు సంబంధించి బుధవారం వెబ్సైట్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్‌గా ఆలోచించడం వల్ల విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందన్నారు. విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకతను వెలికి తీసేందుకే టెక్ ఫేస్ట్ లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోడింగ్ నాన్ టెక్నికల్ తదితర అంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అసోసియేట్ డీన్ రమణ, సి ఎస్ సి విభాగాధిపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.